# అబ్రాహాం

నోవహు వంశావళి అబ్రాముతో ముగుస్తుంది (ఆది 11:26). దేవుడు అబ్రాహాం (అనేకులకు తండ్రి) అని కూడా అన్నాడు. కల్దీయుల (దక్షిణ మోసపోటేమియా) దేశంలోని ఊరు అనే పట్టణంలో వున్న అబ్రాహాంను దేవుడు అక్కడ నుంచి కనానుకు వెళ్లమన్నాడు. (ఆది 12:1-3). అబ్రాహాం సంతానం తనతో ప్రత్యేకమైన సంబంధం కలిగి వున్న ఒక గొప్ప ప్రజ అవుతారని దేవుడు వాగ్దానం చేశాడు. అబ్రాహాం శారాల ద్వారా వారి సంతానం ద్వారా (ఆది 12:1-3; 15:1-21) ప్రపంచంలోని అన్ని జాతులకు చెందిన ప్రజలకు ఆశీర్వాదం లభిస్తుందని దేవుడు సెలవిచ్చాడు. అబ్రాహాం తన భార్య శారాను తన సోదరుని కుమారుడైన లోతును వెంటబెట్టుకొని ఊరు నుంచి బయలుదేరి వెళ్లాడు. యొర్దానుకు తూర్పు వైపు లోతు స్థిరపడ్డాడు. ఇశ్రాయేలు చరిత్రలో ప్రముఖ స్థలాలనదగిన షెకెములోనూ బేతేలులో నూ ఈజిప్టులోనూ నివసించిన అనంతరం యొర్దానుకు పడమరవైపు హెబ్రోను సమీపంలోని మమ్రే వనంలో అబ్రాహాం స్థిరపడ్డాడు (ఆది 13).

అబ్రాహాం సంతానం విస్తారంగా అభివృద్ధి చెందుతుందని దేవుడు వాగ్ధానం చేశాడు. అయితే అప్పటికీ, అబ్రాహాంకు యింకా పిల్లలు లేరు (ఆది 15). అబ్రాహాంకు తొంబయి తొమ్మిదేళ్ల వయస్సులో శారా ద్వారా కుమారుడు కలిగాడు. అతనే ఇస్సాకు. ఇస్సాకు అనే మాటకు నవ్వు అని అర్థం (ఆది 18:9-15), అబ్రాహాం దేవుని వాగ్ధానాన్ని నమ్మాడు (ఆది 17:1-7). ఇస్సాకును తనకు దహనబలిగా అర్పించమని దేవుడు అబ్రాహాంను అడిగినప్పుడు సహితం అబ్రాహాం విశ్వాసం సడలలేదు. అయితే, దేవుడు ఇస్సాకును బ్రతికించాడు. మరోసారి దేవుడు అబ్రాహాం కిచ్చిన వాగ్దానాన్ని పునరుద్ఘాటించాడు (ఆది 22:1-19).

క్రొత్త నిబంధనలో అబ్రాహాంను విశ్వాసానికి ప్రతీకగా ప్రస్తావించారు (అ.కా. 7:2-50; గలతీ 3:1-29); హెబ్రీ 6:13,14; 7:1-10; 11:8).